కాలేజీ నిర్మాణం

● కళాశాల నిర్మాణ పనులపై అలసత్వం
● విద్యార్థినులకు ఇక్కట్లు

ఏలేశ్వరం: ఏలేశ్వరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల అదనపు భవనాల నిర్మాణం పనులు నత్తను తలపిస్తున్నాయని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నిర్మాణం చేపట్టి నెలలు గడుస్తున్నా ఇప్పటికి శ్లాబ్ పనులు వరకు మాత్రమే పూర్తిచేశారు. వచ్చే మార్చి కల్లా పనులు పూర్తిచేయవల్సి ఉండగా పనులు మందకొడిగా సాగుతున్నాయి. 2024లో కేంద్ర ప్రభుత్వం కళాశాల అదనపు భవనాల(గదుల) నిర్మాణం, ఫర్నీచర్ తదితర వసతుల నిమిత్తం నిధులు కేటాయించింది. ప్రధానమంత్రి రాష్ట్రీయ ఉచ్ఛాతర్ శిక్షా అభియాన్ పథకం ద్వారా రూ.5 కోట్లు కేటాయించింది. దీనిలో రూ.4 కోట్లతో భవన నిర్మాణాలు, రూ.50 లక్షలతో ఫర్నీచర్, మరో రూ.50 లక్షలతో కంప్యూటర్స్, డిజిటల్ ల్యాబ్‌లతో వంద మీటర్ల మేర ప్రహరీ నిమిత్తం నిధులు కేటాయించారు.

విద్యార్థులు, అధ్యాపకుల ఇబ్బందులు

చాలీచాలని వసతులతో విద్యార్థులు, అధ్యాపకులు ఇబ్బందులు పడుతున్నారు. కాగా ప్రస్తుతం కళాశాల పక్కా భవనంలో నాలుగు గదులు ఉండగా తాత్కాలికంగా షెడ్ నిర్మించి దానిలో నాలుగు గదులు, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మరో మూడు గదులు తీసుకుని తరగతులు నిర్వహిస్తున్నారు. వీటిలో బీఏ, బీకాం, బీఎస్సీ కంప్యూటర్స్, బీఎస్సీ బోటనీ గ్రూపులు నిర్వహిస్తుండగా సుమారు 250 మంది విద్యార్థినులు ఉన్నారు. ప్రస్తుతం ఉన్న భవనంలో నాలుగు గదులు ఉండగా ఒకటి ఆఫీసురూమ్ కాగా మరొకటి స్టాఫ్ ఉంటున్నారు. మిగిలిన వాటిలో తరగతులు నిర్వహిస్తున్నారు. భవన నిర్మాణం త్వరగా చేపడితే విద్యార్థులు, సిబ్బంది కష్టాలు గట్టెక్కుతాయి.

కూటమి గొప్పలు

పేరు గొప్ప ఊరు దిబ్బ అనే చందంగా తయారైంది ప్రభుత్వ డిగ్రీ కళాశాల నిర్మాణం. తాము అధికారంలోకి రాగానే విద్యారంగానికి పెద్దపీట వేస్తామని కూటమి ఓ వైపు గొప్పలు చెబుతూనే..మరోవైపు విద్యావ్యవస్థను నిర్వీర్యం చేస్తోంది అనడానికి నిదర్శనమే కళాశాల నిర్మాణమని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వెంటనే కళాశాల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.



ఏలేశ్వరం మహిళా ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవనం



నిర్మాణంలో ఉన్న అదనపు భవనం

గడువులోగా నిర్మాణం పూర్తి



"కళాశాల అదనపు భవనాల నిర్మాణంలో నాణ్యత లోపం లేదు. పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాం. గడువులోగా నిర్మాణం పూర్తయ్యేలా పనులు వేగవంతం చేస్తున్నాం.

డి.సునీత, ప్రిన్సిపాల్
ప్రభుత్వ డిగ్రీ కళాశాల,
ఏలేశ్వరం"

నాసిరకం పనులు

కేంద్ర ప్రభుత్వం సరిపడా నిధులు కేటాయించిన పనుల్లో నాణ్యత ఉండడం లేదని ఆరోపణలు వస్తున్నాయి. పనులు సాఫీగా జరగడంతో పాటు నాసిరకంగా ఉంటున్నాయని విమర్శలు వస్తున్నాయి. అధికారులు ప్రత్యేక దృష్టి సారించి పనుల్లో నాణ్యతతోపాటు గడువులోగా పనులు పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

క్లుప్తంగా

బీసీ హాస్టల్‌లో ఆకస్మిక తనిఖీలు



గురుకుల హాస్టల్ పరిసరాలు పరిశీలిస్తున్న తహసీల్దార్ ప్రసాద్

తుని: స్థానిక బీసీ వెల్ఫేర్ బాయ్స్ హాస్టల్, జగన్నాధగిరి గురుకుల పాఠశాల బాలికల హాస్టల్లను తహసీల్దార్ జీవీఎస్ ప్రసాద్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల పరిసరాలు, వాతావరణం, పిల్లలకు అందిస్తున్న ఆహారం, కల్పిస్తున్న సౌకర్యాలపై సిబ్బందిని ఆరా తీశారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఏదైనా ఇబ్బందులు ఉంటే తమకు ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. విద్యార్థులకు మెరుగైన విద్య, ఆహారం అందించాలని నిర్వాహకులను ఆదేశించారు.

బయోపెస్టిసైడ్లతో పంట నాణ్యత మెరుగు



రైతులకు సూచనలిస్తున్న జిల్లా సహాయ సంచాలకుడు బుల్లిబాబు

శంఖవరం: బయోపెస్టిసైడ్లతో పంట నాణ్యత మెరుగవుతుందని జిల్లా వనరుల కేంద్ర వ్యవసాయ సహాయ సంచాలకుడు ఎస్.బుల్లిబాబు రైతులకు సూచించారు. మండలంలోని ఆరెంపూడిలో నిర్వహించిన పొలంబడి కార్యక్రమంలో భాగంగా వరి సాగులో పాటించవల్సిన యాజమాన్య పద్ధతుల గురించి రైతులకు వివరించారు. బయోపెస్టిసైడ్లు వాతావరణ కాలుష్యాన్ని తగ్గించి నేల సారాన్ని మెరుగుపరచి రసాయనక పురుగుమందుల వాడకాన్ని తగ్గించాలన్నారు. సుడోమోనాస్, ట్రైకోడెర్మావిరిడి, వేపనూనె వంటి వాడాలన్నారు. అనంతరం వరి పొలాలను పరిశీలించి ఎలుకల నివారణకు తీసుకోల్సిన జాగ్రత్తలపై వివరించారు. కార్యక్రమంలో ఏఓ పి.గాంధీ, ఏఈఓ శ్రీనువాస్, వ్యవసాయ సహాయకుడు జగదీష్, రైతులు పాల్గొన్నారు.

ప్రాణాలు కాపాడిన సీపీఆర్



గుండెపోటుకు గురైన వ్యక్తికి సీపీఆర్ చేస్తున్న డాక్టర్ రామలక్ష్మి

గోకవరం: పాము కాటుతో పాటు గుండెపోటుకు గురైన వ్యక్తికి గోకవరం ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు సకాలంలో సీపీఆర్ చేసి ప్రాణాలను కాపాడారు. సిబ్బంది వివరాల ప్రకారం గోకవరం ప్రభుత్వ ఆసుపత్రిలో గురువారం ప్రధాన వైద్యురాలు రామలక్ష్మి సీపీఆర్‌పై సిబ్బందికి అవగాహన కల్పిస్తున్నారు. ఈ నేపథ్యంలో అదే సమయంలో పాతరామవరానికి చెందిన కె.వెంకటరమణను విషపూరితమైన పాము కాటు వేయడంతో చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తీసుకువచ్చారు. బాధితుడు కొంత సమయానికి ఆసుపత్రిలో గుండెపోటుకు గురయ్యాడు. వెంటనే అక్కడే ఉన్న ప్రధాన వైద్యురాలు రామలక్ష్మి సుమారు 6 నుంచి 10 నిమిషాల పాటు సీపీఆర్ చేసి ప్రాణాలను కాపాడారు. అనంతరం పాము కాటుకు వైద్యం చేశారు. ప్రస్తుతం రోగి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని సిబ్బంది తెలిపారు.

ఆదిత్య ప్రొఫెసర్‌కు సర్వేపల్లి రాధాకృష్ణన్ పురస్కారం



పురస్కార గ్రహీతను అభినందిస్తున్న ఆదిత్య అధ్యాపకులు

గండేపల్లి: సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీ ప్రొఫెసర్‌కు సర్వేపల్లి రాధాకృష్ణన్ ఉత్తమ బోధకుడు పురస్కారం–2025 లభించినట్టు డిప్యూటీ ప్రో చాన్సలర్ ఎం.శ్రీనివాసరెడ్డి గురువారం తెలిపారు. ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా సేవలందిస్తున్న పాలేపు నారాయణరావు విద్యారంగంలో చేసిన విశేష సేవలకుగాను ఈ గుర్తింపు లభించిందని, పురస్కారాన్ని విజయవాడలో విద్యామంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో అందుకున్నట్టు పేర్కొన్నారు. ప్రో చాన్సలర్ ఎస్. సతీష్‌రెడ్డి, ప్రొ వైస్ చాన్సలర్ రమేష్, ఆర్‌వివి కృష్ణ, నారాయణరావుకు అభినందనలు తెలిపారు.

నకిలీ మద్యం బాధ్యులపై చర్యలు తీసుకోవాలి



ప్రత్తిపాడులో ముద్రగడ గిరిబాబు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు

ప్రత్తిపాడు: నకిలీ మద్యం కేసులో బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు ఆధ్వర్యంలో వైస్సార్ సీపీ శ్రేణులు భారీ ఎత్తున ఆందోళన చేపట్టాయి. నకిలీ మద్యానికి వ్యతిరేకంగా పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు ప్రత్తిపాడులో గురువారం పార్టీ శ్రేణులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక లయన్స్‌క్లబ్ కల్యాణ మండపం నుంచి ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయం వరకు ప్లకార్డులు చేతబట్టి, నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ధర్నా అనంతరం ఎక్సైజ్ సీఐ పి.శివప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కాకినాడ, నరసాపురం పార్లమెంట్ పార్టీ పరిశీలకులు దాట్ల సూర్యనారాయణరాజు, ముదునూరి మురళీకృష్ణంరాజు, నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు ఒమ్మి రఘురామ్, రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ స్థాయి నాయకులు వాసిరెడ్డి జమీలు, బెహరా దొరబాబు, అడపా సోమేష్, సామంతుల సూర్యకుమార్‌లతో పాటు వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు తదితరులు భారీ ఎత్తున పాల్గొన్నారు.

వందలాదిగా తరలివచ్చిన పార్టీ శ్రేణులు

ఏలేశ్వరం: నకిలీ మద్యంపై చేపట్టిన నిరసన కార్యక్రమానికి నియోజకవర్గ వ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ శ్రేణులు భారీగా తరలివచ్చారు. కార్యక్రమంలో భాగంగా నిరసనకు ఏలేశ్వరం నుంచి పార్టీ నాయకులు, శ్రేణులు, కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు. కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో నెలకొన్న వ్యతిరేకతకు ప్రత్తిపాడు నిలువెత్తు నిదర్శనంగా నిలిచింది. కార్యక్రమంలో పార్టీ పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకుడు దాట్ల సూర్యనారాయణరాజు, నర్సాపురం పార్లమెంట్ పరిశీలకుడు ముదునూరి మురళీకృష్ణంరాజు, నియోజకవర్గ పరిశీలకుడు ఒమ్మి రఘురామ్, మాజీ ఎమ్మెల్సీ అంగూరి లక్ష్మీశివకుమారి, రాష్ట్ర మహిళ విభాగం కార్యదర్శి బెహరా రాజేశ్వరీ, రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి బదిరెడ్డి గోవిందు, వాసిరెడ్డి జమీలు, తదితరులు పాల్గొన్నారు.

కుట్రలను తిప్పికొడదాం



ప్రత్తిపాడులో కోటి సంతకాల సేకరణపై పార్టీ శ్రేణులతో కలసి పోస్టర్ ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు

కోటి సంతకాల సేకరణ పోస్టర్ ఆవిష్కరణ

ప్రత్తిపాడు: ప్రజా వైద్యాన్ని ప్రైవేటీకరించే విధానాలను కూటమి ప్రభుత్వం విరమించుకోకపోతే పరిణామాలు తీవ్రంగా ఉంటయాని ప్రత్తిపాడు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు అన్నారు. ప్రత్తిపాడు లయన్స్‌క్లబ్ కల్యాణ మండపం ఆవరణలో గురువారం పార్టీ శ్రేణులతో కలిసి వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణకు సంబంధించిన పోస్టర్లను నాయకులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కోటి సంతకాల సేకరణలో తొలి సంతకం ముద్రగడ గిరిబాబు చేసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మెడికల్ కళాశాలలను ప్రైవేట్ పరం చేస్తే పేదవాడికి తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి ప్రజా వైద్యంతో మంచి పేరు వస్తుందన్న అక్కసుతోనే చంద్రబాబు నాయుడు 17 ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటీకరించేందుకే నిర్ణయించుకున్నారన్నారు. పీపీపీ విధానాన్ని విరమించుకునే వరకు ప్రజల మద్దతులో వైఎస్సార్ సీపీ అలుపెరగని పోరాటం చేస్తుందని అన్నారు. ప్రజా వైద్యం ప్రజలకే చెందాలన్న ఉద్దేశ్యంతో జగనన్న చేపట్టిన కోటి సంతకాల సేకరణలో పార్టీ నాయకులు, కార్యకర్తలు భాగస్వాములై విజయవంతం చేయాలని ముద్రగడ గిరిబాబు కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ అంగూరి లక్ష్మీశివకుమారి, పార్టీ నాయకులు వాసిరెడ్డి జమీలు, బెహరా దొరబాబు, బదిరెడ్డి గోవిందు, సామంతుల సూర్యకుమార్, అడపా సోమేష్, బీశెట్టి అప్పలరాజు, కోరాడ ప్రసాద్, పైల విజయ్‌కుమార్, శెట్టిబత్తుల కుమార్‌రాజా, జెడ్పీటీసీ బెహరా రాజరాజేశ్వరి, నాలుగు మండలాల పార్టీ కన్వీనర్లు రామిశెట్టి బులిరామకృష్ణ, గొల్లపల్లి సురేష్, నరాల శ్రీను, చింతకాయల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి

ప్రత్తిపాడు రూరల్: మామిడి, జీడి మామిడి సాగులో రైతులు మేలైన యాజమాన్య పద్ధతులను పాటించాలని ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ చల్లా వెంకట నరసింహరావు సూచించారు. మండలంలోని పాండవులపాలెం, బవురువాక గ్రామాల్లోని సచివాలయం వద్ద డాక్టర్ నరసింహారావుతో కలిసి ఆయన మామిడి, జీడిమామిడి సాగులో సమగ్ర సస్యరక్షణ, మేలైన ఎరువులు, యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల ఉద్యానశాఖ అధికారి కె.దివ్యశ్రీ, గెద్దం వెంకట రమణ, గ్రామ ఉద్యాన సహాయకులు కె.బాల వీరాస్వామి రైతులు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుతో వాహనదారులకు మేలు

తుని: కేంద్ర ప్రభుత్వం తగ్గించిన జీఎస్టీతో వాహనదారులకు ఆర్థిక చేయూత లభిస్తుందని కత్తిపూడి ఎంవీఐ శ్రీనివాస్, అసిస్టెంట్ కమీషనర్ ధర్మారావు అన్నారు. తుని పట్టణంలో గురువారం సూపర్ జీఎస్టీ..సూపర్ సేవింగ్స్‌పై ఆటోలు, క్యాబ్‌లతో భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ స్థానిక ఎల్‌బీసీ బిల్డింగ్ నుంచి గొల్లప్పారావు సెంటర్ వరకూ సాగింది. అనంతరం ఎంవీఐ శ్రీనివాస్ మాట్లాడుతూ వాహనాలపై 28 శాతం ఉండే జీఎస్టీని 18 శాతానికి తగ్గించారన్నారు. తగ్గించిన జీఎస్టీతో కలిగే ప్రయోజనాలను వాహనదారులకు వివరించారు. హీరో, టీవీఎస్ షోరూంల సిబ్బంది పాల్గొన్నారు.

జీవన ఎరువుల వినియోగంపై అవగాహన

తుని: మండలంలోని వెలమకొత్తూరు ఏఓ అశోక్‌కుమార్ అధ్యక్షతన గురువారం జీవన ఎరువులపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఏరువాక కేంద్రం సైంటిస్టు డాక్టర్ శర్మ రైతన్నలకు పాస్ఫరస్ కరిగించే బ్యాక్టీరియా, పొటాష్ కరిగించే బ్యాక్టీరియాల గురుంచి అవగాహన కల్పించారు. కూరగాయల సాగు, పత్తి పంటల గురుంచి వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ దైవప్రసాద్, వీఏఏ జ్యోతి పాల్గొన్నారు.

తలుపులమ్మ సన్నిధిలో శ్రీరాంజీ

జగ్గంపేట: తలుపులమ్మ లోవ అమ్మవారిని వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి తోట శ్రీ రాంజీ గురువారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. నియోజకవర్గ శ్రామిక విభాగం అధ్యక్షురాలు గుర్రం మహాలక్ష్మి అమ్మవారికి పార్టీ తరఫున మొక్కుకున్న మొక్కు చెల్లించే కార్యక్రమంలో భాగంగా పార్టీ నేతలతో కలిసి తలుపులమ్మ లోవను ఆయన సందర్శించారు. ఈ కార్యక్రమంలో జగ్గంపేట మండల పార్టీ అధ్యక్షుడు రావుల గణేష్‌రాజా, జిల్లా కార్యదర్శి వరుపుల సూరిబాబు, సీనియర్ నాయకులు మొగిలి శ్రీనివాస్, కాకినాడ జిల్లా బూత్ కమిటీ మెంబర్ రావుల సురేష్ కుమార్, గ్రామ పార్టీ అధ్యక్షుడు దొడ్డ సూరిబాబు, జగ్గంపేట మండల విద్యార్థి విభాగం అధ్యక్షుడు మండపాక బాబి పాల్గొన్నారు.



తలుపులమ్మ అమ్మవారిని దర్శించుకున్న తోట శ్రీరాంజీ, పార్టీ నాయకులు

డ్వాక్రా సెక్రటరీపై విచారణ

గండేపల్లి: మండల కేంద్రం గండేపల్లిలో లక్ష్మి సాయి గ్రూప్ సభ్యుల్లో తలెత్తిన వివాదం నేపథ్యంలో గ్రూప్ సెక్రటరీ జి.లోవలక్ష్మి సీపీ గ్రామ్స్‌లో ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో జిల్లా అధికారులు విచారణ నిర్వహించి ఫిర్యాదును క్లోజ్ చేయగా ఫిర్యాదు దారులకు న్యాయం జరగకపోవడంతో మరోసారి పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. డీఆర్‌డీఏ నుంచి గురువారం వచ్చిన జిల్లా అధికారి అడిషనల్ ప్రాజెక్టు డైరెక్టర్ ఎం.జిలాని, పీజీఆర్ఎస్ ఆడిట్ టీమ్ సభ్యులు ఎస్.కె అమీర్ భాషా గండేపల్లి ఎం.ఎస్ భవనంలో గ్రూప్ సభ్యులతో మాట్లాడి స్టేట్‌మెంట్ నమోదు చేసుకున్నారు. ఫిర్యాదురాలు లోవలక్ష్మి మాట్లాడుతు అప్పు ఎంత ఉందని తెలుసుకునే ప్రయత్నం చేయడంతో ఈ వివాదం నెలకొందని, విషయాన్ని ఏపీఎం సన్యాసిరావుకు తెలియజేయగా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసుకోండి అంటూ నిర్లక్ష్యంగా బదులివ్వడంతో ఫిర్యాదు చేశానని, దీనిని సాకుగా తీసుకుని నాకు పూర్తి సమాచారం తెలపకుండానే గ్రూప్‌ను క్లోజ్ చేశారని, ఇప్పుడు నేను ఏ గ్రూప్‌లో చేరాలంటూ అధికారులను ఆమె ప్రశ్నించారు. అనంతరం అధికారులు మాట్లాడుతు గ్రూప్‌లకు సంబంధించి ఎటువంటి ఫిర్యాదులందిన చర్యలు తీసుకోంటామని ఏపీఎం, వీఓఏలకు అధికారులు బదులిచ్చారు.



విచారణకు వచ్చిన జిల్లా అధికారి (ఎడమ నుంచి రెండవ వ్యక్తి)

మీడియాపై అసహనం

స్థానిక ఎంఎస్ భవనంలో జిల్లా అధికారులు విచారణకు వచ్చారని తెలుసుకుని అక్కడకు వెళ్లిన మీడియాపై జిల్లా అధికారులు చిరు బురులాడారు. మీడియా ప్రతినిధులపై జిల్లా అడిషనల్ ప్రాజెక్టు డైరెక్టర్ ఎం.జిలాని మిమ్మల్ని ఎవరు రమ్మన్నారు బయటకు వెళ్లాలంటూ అసహనం వ్యక్తం చేయగా అక్కడే ఉన్న గ్రూప్ సభ్యులు, ఇతర అధికారులు విస్మయానికి గురయ్యారు.

బాలుర వసతిగృహంలో తనిఖీలు

ప్రత్తిపాడు: ప్రత్తిపాడు ప్రభుత్వ ఎస్సీ బాలుర వసతిగృహాన్ని గురువారం ఎంపీడీఓ ఎంవీఆర్ కుమార్‌బాబు ఆకస్మికంగా తనిఖీ చేశారు. వంటగది, గదులు, వసతిగృహ పరిసరాలను ఆయన క్షుణంగా పరిశీలించారు. డైనింగ్ హాలుపై షెడ్డు, స్టడీ ప్లాట్‌ఫారం నిర్మించాలని వసతిగృహ సంక్షేమాధికారి ఎంఎన్ సత్యనారాయణ అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. వసతిగృహం వెలుపల ఉన్న మురుగునీటి నిల్వలను వెంటనే తొలగించే ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ జి.సుబ్బలక్ష్మి పంచాయతీ కార్యదర్శి జ్యోతుల పద్మరాజు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

జగ్గంపేట: మండలంలోని జగ్గంపేట, నరేంద్రపట్నం 11కెవి ఫీడర్, జగ్గంపేట ఇండస్ట్రియల్ ఫీడర్ నందు ఆర్‌డీఎస్ఎస్ మరమ్మతులు కారణంగా శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ డిఇ వీరభద్రరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు భావవరం, గొల్లలగుంట, గుర్రంపాలెం గ్రామాలకు వ్యవసాయ బోరులకు విద్యుత్ సరఫరా అంతరాయం ఏర్పడుతుందని వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

ఉద్యాన పంటల సాగుపై శిక్షణ



రైతులతో మాట్లాడుతున్న మండల ఉద్యాన అధికారి శ్రీవల్లి

గండేపల్లి: మండలంలోని కె.గోపాలపురం, ఉప్పలపాడు గ్రామాల్లో గురువారం ఉద్యానశాఖ ఆధ్వర్యంలో రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మండల ఉద్యానాధికారి ఎ.శ్రీవల్లి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి కలవచర్ల కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త ఎన్.వి రఘునందన్ పాల్గొని సమగ్ర ఎరువులు యాజమాన్యం, కత్తిరింపులు, సస్యరక్షణ చర్యలు పాటిస్తే నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చునని రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

తుప్పల తొలగింపు

తుని: ఎస్.అన్నవరం వద్ద రోడ్డుకు ఇరువైపులా పెరిగిపోయిన తుప్పలను మున్సిపల్ అధికారులు గురువారం తొలగించారు. మార్గంలో తుప్పలు భారీగా పెరిగిపోవడంతో రాకపోకలకు ఇబ్బంది పడుతున్నామని వాహనదారులు ఎమ్మెల్యే యనమల దివ్య దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే ఆదేశాలతో మున్సిపల్ అధికారులు రైల్వేగేటు నుంచి తుని టౌన్ పరిధి వరకూ పెరిగిన తుప్పలను ప్రొక్లెన్ సహాయంతో తొలగించారు. తుప్పల తొలగింపుపై వాహనచోదకులు సంతోషం వ్యక్తం చేశారు.

పోలీస్ స్టేషన్‌లో తనిఖీలు

గోకవరం: మండల కేంద్రం గోకవరం పోలీస్ స్టేషన్‌లో రికార్డులను నార్త్‌జోన్ డీఎస్పీ వై.శ్రీకాంత్ గురువారం తనిఖీ చేశారు. వార్షిక తనిఖీలో భాగంగా ఆయన పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. పోలీస్ స్టేషన్‌లో సిబ్బంది వివరాలను కోరుకొండ సీఐ సత్యకిశోర్, ఎస్సై పవన్‌కుమార్‌లను అడిగి తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించి పెండింగ్ కేసుల వివరాలను తెలుసుకుని కోర్టు పరిధిలో ఉన్న కేసులను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. డీఎస్పీ మాట్లాడుతూ దీపావళి పండుగ సందర్భంగా బాణసంచా విక్రయించే వ్యాపారులు లైసెన్స్ కలిగి ఉండాలని, లేనియెడల కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

రేపటి సమాజానికి మీరే దిక్సూచి

గండేపల్లి: రేపటి సమాజానికి మీరే దిక్సూచి అని వక్తలు విద్యార్థులనుద్దేశించి పేర్కొన్నారు. మండల కేంద్రం గండేపల్లి పంచాయతీ కార్యాలయం వద్ద ఐసీడీఎస్ సీడీపీఓ ఎం.పూర్ణిమ ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాలికా దినోత్సవం, పోషకాహార మాసోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. హైస్కూల్స్ విద్యార్థులకు బాల్య వివాహాలు, సైబర్ సేఫ్టీ, బాలల హక్కులపై వ్యాస రచన పోటీలలో విజేతలకు బుక్ స్టూడెంట్, జీకే, టర్నింగ్ పాయింట్ పుస్తకాలను బహుమతులుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో రమేష్, బాలల పరిరక్షణ జిల్లా అధికారి సిహెచ్ వెంకట్, చైల్డ్ హెల్ప్ లైన్ 1098 ప్రాజెక్ట్ కో ఆర్డీనేటర్ బి శ్రీనివాసరావు, మాజీ వైస్ ఎంపీపీ పోతుల మోహన్‌రావు, జగ్గంపేట, గండేపల్లి, కిర్లంపూడి మండలాల ఐసీడీఎస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

బాలికలకు సైకిళ్ల పంపిణీ

బాలాజీచెరువు: కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీ(సీఎస్ఆర్)లో భాగంగా ఎస్‌బీఐ జిల్లాలో వివిధ పాఠశాలలో చదువుతున్న 18 బాలికలకు గురువారం సైకిళ్లు ఉచితంగా పంపిణీ చేసింది.

ఆసక్తికరంగా సత్యహరిశ్చంద్ర నాటకం

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ధర్మవరంలో శ్రీగౌరీశంకరుల 89వ వార్షికోత్సవ వేడుకలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా గురువారం స్థానిక కళాకారులు సత్యహరిశ్చంద్ర నాటకంలోని మాట కోసం సర్వం కోల్పోయిన ఘట్టాన్ని వీధి నాటకాన్ని ప్రదర్శించారు. ఈ ప్రదర్శనలో హరిశ్చంద్రుడు ఇచ్చిన మాట ప్రకారం తన రాజ్యాన్ని, భార్య, కుమారుడిని కోల్పోవడమే కాకుండా చివరకు తనకు తాను బానిస (కాటికాపరి)గా అమ్ముడుపోతాడు. ఈ వృత్తాంతం స్థానికులను విశేషంగా ఆకట్టుకుంది. నాటకంలో సత్యహరిశ్చంద్రుడిగా సింగిరెడ్డి రాంబాబు, వీరబాహుడుగా బలిజి వీర్రాజు, నక్షత్రకుడుగా మోరుకుర్తి పెంటయ్య, పోలీగా మంతిన శ్రీను పాత్రలు పోషించారు.



వీధి నాటకాన్ని ప్రదర్శిస్తున్న స్థానిక కళాకారులు

రక్షణ కల్పించండి

ప్రత్తిపాడు: తనపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మండలంలోని గజ్జనపూడి గ్రామానికి చెందిన పల్లి సత్యవతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. మండలంలోని కె.కొత్తపల్లి గ్రామంలోని ఏలేరు కాలువను అనుకొని ఉన్న 30 సెంట్ల పోరంబోకు భూమిని నాలుగు దశాబ్దాలుగా సాగు చేసుకుని జీవిస్తున్నామని, సదరు భూమిని కాజేయాలని ఉద్దేశంతో గ్రామానికి చెందిన ఐదుగురు వ్యక్తులు తాను సాగు చేస్తున్న చిక్కుడు పాదులను ధ్వంసం చేశారని ఆమె ఆరోపించారు. గతంలో తన పంట పాడుచేసిన వారిపై పోలీసులకు ఫిర్యాదు చేయగా కక్షతో తనను చంపుతామంటూ బెదిరిస్తున్నారని ఆమె ఆందోళన వ్యక్తం చేసింది. చర్యలు తీసుకోవాలని, తనకు రక్షణ కల్పించాలని కోరుతూ సత్యవతి ప్రత్తిపాడు పోలీసులకు ఫిర్యాదు చేసింది.